క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన కేంద్ర బృందం



బాల్కొండ: సుపోషిత్ గ్రామపంచాయతీ అభియాన్‌లో ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామంలో బుధవారం అంగన్ వాడీ కేంద్రాలను కేంద్ర బృందం పరిశీలించింది. అంగన్ వాడీ కేంద్రాల్లో గర్భిణి, బాలింతలు, చిన్న పిల్లలకు అందిస్తున్న పోషకాహార వివరాలను బృంద సభ్యులు అడిగి తెలుసుకున్నారు. పిల్లల బరువు, ఎత్తు కొలతలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట



బాల్కొండ: బాల్కొండ మండలం ఇత్వార్‌పేట్‌లో బుధవారం విద్యుత్ అధికారుల ఆధ్వర్యంలో వ్యవసాయ క్షేత్రం వద్ద పొలంబాట నిర్వహించారు. ఈసందర్భంగా ట్రాన్స్‌కో ఏఈ కిషన్ మాట్లాడుతూ.. రైతులు సొంతంగా మరమ్మతులు చేపట్టవద్దన్నారు. విద్యుత్ సరఫరాలోఎలాంటి సమస్య తలెత్తిన వెంటనే లైన్‌మన్‌లకు సమాచారమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ సుందర్‌రావు, లైన్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్య, లైన్‌మన్‌లు నవీన్, యాదగిరి, సోమయ్య, రమేశ్ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో సమస్యలను పరిష్కరించాలి



బాల్కొండ: ముప్కాల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు ఎంపీడీవో బాలగంగాధర్‌రాజుకు వినతిపత్రం అందించారు. నూతన భవనంలో డ్రైయినేజీ వ్యవస్థ లేదన్నారు. హాస్టల్ భవనం వరకు బురదమయంగా రోడ్డు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్ ఆఫీస్‌ను మార్చాలని వినతి



వర్ని: మోస్రా మండల కేంద్రంలో నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పోస్ట్ ఆఫీస్‌ను మార్చాలని మోస్రా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పోస్టల్ సూపరింటెండెంట్‌కు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ప్రధాన రహదారిపై పోస్ట్ ఆఫీస్‌తో పింఛన్ తీసుకునే వృద్ధులకు ఇబ్బందులు కలుగుతున్నాయని వెంటనే అధికారులు ఇతర ప్రాంతానికి తరలించాలని కోరారు. వీడీసీ చైర్మన్ బిల్లా పోతారెడ్డి, వైస్ చైర్మన్ షరీఫ్, కోశాధికారి బొజ్జ స్వామి గౌడ్, నూలు సాయిలు, పిట్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

నందిపేట్(ఆర్మూర్): జీపీ కార్మికులకు వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో చేపట్టే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే.అబ్దుల్ కోరారు. ఈ మేరకు నందిపేటలో బుధవారం పంచాయతీ కార్మికులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల7న హైదరాబాద్‌లో ఈసదస్సు జరుగుతుందన్నారు. కార్మికులు పోశన్న, లింగం, ఐలయ్య, చిన్నదేవన్న, చంద్రకళ, పోశన్న, లక్ష్మి, లీలమ్మ, చిన్నక్క, భూమన్న, పద్మ, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో కమీషన్లు దోచుకున్న వారిని శిక్షించాలి

కమ్మర్‌పల్లి: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కమీషన్లు దోచుకున్న వారిని శిక్షించాలని కాంగ్రెస్ కమ్మర్‌పల్లి మండలాధ్యక్షుడు సుంకెట రవి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కమ్మర్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ రాజ్యసభ ఎంపీ సంతోష్‌రావు అవినీతికి పాల్పడ్డారని మాజీ సీఎం కేసీఆర్ కూతురు ఎమ్మెల్సీ కవిత చెబుతుంటే ఇంకా రుజువేం కావాలని ప్రశ్నించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ బుచ్చన్న, నాయకులు ప్రవీణ్, బుచ్చిమల్లయ్య, గణేష్‌గౌడ్, సింగిరెడ్డి శేఖర్, రేవతి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు 8 గంటలే

- 24గంటలకు అప్‌గ్రేడ్ కాని డొంకేశ్వర్ పీహెచ్‌సీ
- సాయంత్రం నాలుగు తర్వాత అందని వైద్య సేవలు
- ఇబ్బందులు పడుతున్న మండల వాసులు

డొంకేశ్వర్(ఆర్మూర్): గ్రామాలతో పాటు పలు మండల కేంద్రాల్లో వైద్య సేవలు పూర్తిగా అందడం లేదు. కొన్ని పీహెచ్‌సీలు అప్‌గ్రేడ్ కాకపోవడంతో 8 గంటలే వైద్య సేవలు అందిస్తున్నాయి. డొంకేశ్వర్ లో పీహెచ్‌సీ ఏర్పాటై దాదాపు 30ఏళ్లు అవుతున్నా ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకే పని వేళలను పరిమితం చేశారు. మండలం ఏర్పడి మూడేళ్లు పూర్తి కాగా పీహెచ్‌సీని 24గంటల ఆస్పత్రిగా చేయలేదు. కనీసం పాలకులు, అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం లేదు. తద్వారా సాయంత్రం నాలుగు దాటితే డొంకేశ్వర్ పీహెచ్‌సీలో వైద్య సేవలు అందడం లేదు. పని వేళలు పాటించాల్సి రావడంతో సిబ్బంది కూడా సాయంత్రం నాలుగింటికి ఆస్పత్రికి తాళం వేసి వెళ్లిపోతున్నారు. దీంతో సాయంత్రం, రాత్రి సమయాల్లో ప్రజలకు అత్యవసర సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యానికి గురైనా, రోడ్డు ప్రమాదాలు జరిగినా, పాము,కుక్కకాటుకు



డొంకేశ్వర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

గురైనా నందిపేట్‌కు లేదా జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తోందని మండలవాసులు వాపోతున్నారు. మండలంలో 13 గ్రామాలకు కలిపి డొంకేశ్వర్ పీహెచ్‌సీనే పెద్ద ఆస్పత్రి. ఇందులో ఒక మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నిషియన్, ఇద్దరు చొప్పున స్టాఫ్ నర్సులు, సూపర్‌వైజర్లు, ఒక ఆయా ఉన్నారు. నిత్యం 70కిపైగా ఓపీ కేసులు నమోదవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో 24గంటల ఆసుపత్రిగా మారుస్తే బాగుంటుందని, అప్పుడు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుతాయని ప్రజలు పేర్కొంటున్నారు.

ఐదేళ్లుగా ప్రసవాలు లేవు..

పీహెచ్‌సీ కేంద్రాల్లో తప్పనిసరిగా ప్రసవాలు జరగాలని ఇటీవల కలెక్టర్ వినయ్‌కృష్ణా రెడ్డి డొంకేశ్వర్ పీహెచ్‌సీ తనిఖీ చేసిన సందర్భంగా అన్నారు. డొంకేశ్వర్ ఆస్పత్రిలో ప్రసవాలు చేసే వసతులు అందుబాటులో లేవు. ఐదేళ్ల క్రితం జరిగిన నార్మల్ డెలివరీ తర్వాత ఇంత వరకు ప్రసవాలు జరగలేదు. ప్రస్తుతం రెండు పడకలు ఉండగా ఐదు పడకలు చేస్తే వైద్యం అందించడానికి సులువుగా ఉంటుంది. ఈ విషయమై మెడికల్ ఆఫీసర్ శుభాకర్‌ను వివరణ కోరడానికి 'సాక్షి' ప్రయత్నం చేయగా ఆయన ఫోన్‌లో స్పందించలేదు.

ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలి



మండలానికి డొంకేశ్వర్ ఆస్పత్రే పెద్దది. ఇక్కడ రోజుకు 8గంటలకే వైద్య సేవలు అందుతున్నాయి. సాయంత్రం, రాత్రి సమయాల్లో అత్యవసర వైద్య సేవలు అందడం లేదు. తద్వారా ప్రజలు వేరే మండలానికి వెళ్లాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు దీనిపై చొరవ తీసుకుని 24గంటల ఆస్పత్రిగా మార్చాలి. – టి.రాజేశ్వర్, జీజీ నడ్కుడ

నష్టపరిహారం అందించాలి

బాల్కొండ: పంట నష్టపరిహారం వెంటనే అందించాలని బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మెండోరా మండలం సావెల్ గ్రామంలో గోదావరి ప్రవాహానికి కొట్టుకుపోయిన పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలతో రైతులకు తీరని నష్టం జరిగిందని, వేల ఎకరాల్లో పంటకు నష్టవాటిలిందన్నారు. రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు. అనంతరం సావెల్ గ్రామంలో స్థానిక మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి మంజూరైన ఎంపీ నిధులు రూ. 4.2 లక్షల ప్రొసీడింగ్‌కాపీని సంఘ సభ్యులకు అం



సావెల్‌లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి

దజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోధన అభ్యసన పరికరాల మేళాకు స్పందన



కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం నిర్వహించిన మండల స్థాయి బోధన అభ్యసన పరికరాల ప్రదర్శన(టీఎల్ఎం) మేళాకు విశేష స్పందన లభించింది. ఈమేళాను ఎంపీడీవో రాజశ్రీనివాస్, తహసీల్దార్ ప్రసాద్, ఎస్ఐ అనిల్‌రెడ్డి, ఎంఈవో ఆంద్రయ్య ప్రారంభించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని వినూత్నమైన తాము తయారు చేసిన బోధన భ్యాసన పరికరాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనలను పరిశీలకులు జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ప్రశంస పత్రాలను అందజేశారు. హెచ్ఎం రామ్‌ప్రసాద్, ఎమ్మార్పీ చంద్రశేఖర్, రవీందర్, వేణు, ప్రసాద్, సంతోష్, శంకర్‌గౌడ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలి

ఆర్మూర్‌టౌన్: న్యాయవాదులకు అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకురావాలని న్యాయవాద బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కులశ్రీధర్, జెస్సు అనిల్ అన్నారు. బుధవారం ఆర్మూర్ కోర్టులోని న్యాయవాద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకురావాలని వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఎన్నికలు నిర్వహించకపోవడం సరైంది కాదని వెంటనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ స్పందించకపోవడంతో జేఏసీ కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైద్యులకు డాక్టర్స్ ప్రొడక్షన్ యాక్ట్ తెచ్చారో అదేవిధంగా రాష్ట్ర ప్ర



ఆర్మూర్ బార్ అసోసియేషన్ హాల్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

భుత్వం న్యాయవాదులకు రక్షణ చట్టంతో పాటు అన్నిరకాల రక్షణ, సహాయ చర్యలను తీసుకురావాలన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లోక భూపతిరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పత్తి దిగుమతిపై పన్ను రద్దును ఉపసంహరించుకోవాలి

ఆర్మూర్/కమ్మర్‌పల్లి : కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతిపై 11శాతం పన్నును రద్దు చేసిందని ఈరద్దును వెంటనే ఉపసంహరించుకోవాని సంయుక్త కిసాన్ యువమోర్చా జిల్లా నాయకులు బి. కిషన్ డిమాండ్ చేశారు. ఆర్మూర్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం సంయుక్త కిసాన్ యువమోర్చా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ సుజాతకు వినతి అందజేశారు. అలాగే ఏఐయూకేఎస్ నాయకులు కమ్మర్‌పల్లి తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ అవలంభిస్తున్న రైతు వ్యతిరేక దిగుమతి, ఎగుమతి మూలంగా పత్తి ఉత్పత్తి 10లక్షల టన్నుల వరకు



ఆర్మూర్ తహసీల్‌లో డీటీ సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న కిసాన్ యువమోర్చా నాయకులు

పడిపోయిందన్నారు. సంయుక్త కిసాన్ యువమోర్చా నాయకులు భూమన్న, కుతాడి ఎల్లయ్య, లింబాద్రి, గంగారాం, నాయకులు కిషన్, అశోక్, సత్తెక్క, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు

నిజామాబాద్‌అర్బన్: పాలకులు విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎస్‌పి స్టాలిన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాలుగో మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో కొత్త సమస్యలను సృష్టిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ విద్యాశాఖ మంత్రిని కూడా నియమించలేని దుస్థితి ఏర్పడిందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర 4వ మహాసభలు వేదికగా నిలిచాయని పేర్కొన్నారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకురాలు పద్మ మాట్లాడుతూ 1936లో ఉత్తరప్రదేశ్‌లో అఖిల భారత విద్యార్థి సమైక్య ఆవిర్భవించిందన్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణకై విద్య రంగ సమస్యలపై సమరశీల ఉద్యమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, రాష్ట్ర



మాట్లాడుతున్న ఎస్‌పి స్టాలిన్

కార్యదర్శి లక్ష్మణులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పౌరుల చదువుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భూమయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య. జెవీవీ రాష్ట్ర నాయకులు రామారావు, ఎస్ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్‌మారయ్యగౌడ్, కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ రజనీకాంత్, బీబీసీ విద్యా సంస్థల చైర్మన్ ప్రవీణ్, ఎస్సార్ విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్, అల్ఫోర్స్ జోనల్ ఇన్‌ఛార్జి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన చేపూర్ గ్రామస్తులు

పెర్కిట్: ఆర్మూర్ మండలం చేపూర్ సామాజిక మాధ్యమం సభ్యులు ఆపదలో ఉన్న గ్రామస్తులను ఆదుకుంటూ మానవత్వం చాటుతున్నారు. గ్రామానికి చెందిన సూరిసీడ గణేశ్ రెండు రోజుల క్రితం గణేశ్ మండపంలో స్టాండ్‌పై నుంచి కిందపడడంతో తలకు తీవ్ర గాయమైంది. కోమా పరిస్థితిలో ఉండి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గణేశ్ నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో చేపూర్ వాట్సాప్ గ్రూపు సభ్యులు స్పందించి రూ. ఒక లక్ష 80 వేలను ఆస్పత్రి వ్యయాల కోసం అందజేశారు. దాతల సహకారంతో గణేశ్ కోలుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మీనుగు నరేశ్‌కు సైతం వాట్సాప్ గ్రూపు సభ్యులు రూ.45 వేలను ఆర్థిక సహాయంగా అందించారు. ఆపదలో ఉన్న గ్రామస్తులతో పాటు ఆర్థిక పరిస్థితి బాగా లేని వారిని ఆదుకుంటూ అండగా నిలుస్తున్నారు. ఇందుకోసం 2018లో వాట్సాప్ గ్రూపు మాధ్యమాన్ని ఏర్పాటు చేసి సేవలందిస్తున్న గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ మీనుగు రాజేశ్వర్‌ను గ్రామస్తులు అభినందిస్తున్నారు.



చికిత్స పొందుతున్న యువకుడు

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



ఆర్మూర్ గూండ్లచెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా



బాల్కొండలో పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై, తదితరులు

అర్మూర్‌టౌన్: వినాయక నిమజ్జన చెరువులను సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగే విధంగా అన్ని విధాల ఏర్పాట్లు చేయాలన్నారు. ఎక్కడ కూడ మండపాల నిర్వాహకులు ఇబ్బందులు పడద్దని, నిమజ్జన చెరువుల వద్ద లైటింగ్, క్రేన్‌లు, మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. చిన్నాపిల్లలను చెరువు వద్ద రాకుండా చూడాలన్నారు. పట్టణంలోని గూండ్ల చెరువు, పెర్కిట్, కోటార్మూర్, మామిడిపల్లి చెరువులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రాజు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

బాల్కొండ: బాల్కొండ మండలకేంద్రంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లను తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను స్థానిక ఊర చెరువులో నిమజ్జనం చేస్తారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. చెరువు వద్దకు గుంతల మయంగా ఉన్న రోడ్డును వెంటనే చదును చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎస్సై శైలెందర్, ఎంపీవో గంగామోహన్, ట్రాన్స్‌కో ఏఈ కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నిమజ్జన శోభాయాత్ర



కొల్‌పూర్‌లో తరలుతున్న గణనాథుడు



కళ్యాపూర్‌లో శోభాయత్రలో పాల్గొన్న భక్తులు

నందిపేట్/రెంజల్: నందిపేట మండలం ఐలాపూర్, కొల్‌పూర్ గ్రామాలలో, రెంజల్ మండలం కళ్యాపూర్ గ్రామంలో సోమవారం సాయంత్రం గణనాథుల శోభాయాత్ర ఘనంగా కొనసాగింది. ఈసందర్భంగా మహిళల కోలాటాలు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.

డీజేలు అద్దెకు ఇవ్వం

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు శబ్ద కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని గణేశ్ మండపాల నిర్వాహకులకు నిమజ్జనం రోజు డీజేలు అద్దెకు ఇవ్వమని యజమానులు పోలీసులకు రాతపూర్వకంగా తెలియజేశారు. పట్టణంతో పాటు మండలానికి చెందిన డీజే యజమానులు బుధవారం ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ను కలిసి ఒకవేళ డీజే పెట్టిన క్రిమినల్ చర్యలకు బాధ్యులమని రాసి ఇచ్చారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

బోధన్‌టౌన్(బోధన్): ఈ నెల 4, 5 వ తేదీల్లో బోధన్‌లో వినాయక నిమజ్జన శోభాయాత్రలో పోలీసుల సూచించిన నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన చేశారు. నిమజ్జన శోభాయాత్రలో డీజేలు ఉపయోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



డీజేలు అద్దెకివ్వబోమని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వోకు లేఖ ఇస్తున్న డీజే యజమానులు

డీజేలను సీజ్ చేస్తాం

మాక్లూర్: వినాయక నిమజ్జనం సందర్భంగా పెద్దశబ్దంతో డీజేలు పెడితే బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై రాజశేఖర్ హెచ్చరించారు. మండలంలోని ఆయా గ్రామాల గణేశ్ మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆ యన మాట్లాడారు. ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనోత్సవాలు జరుపుకోవాలని ఎస్సై రాజశేఖర్ సూచించారు.

మండపాల వద్ద సామూహిక కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



శ్రీకృష్ణ యాదవ సంఘం గణేశుని వద్ద...



ఆర్మూర్ డీఈ కార్యాలయంలో పూజలు చేస్తున్న డీఈ రాజేశ్వర్‌రావు, సిబ్బంది

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలోని సత్య (కర్ర) గణపతి రోజుకో విశేష పూజలు అందుకుంటున్నాడు. బుధవారం సుమారు 200మంది మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొని విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వచ్చి కర్ర గణపతిని దర్శించుకుని ముడుపులు కడుతున్నారు. సర్వ సమాజ్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు నిత్యన్న దానం చేస్తున్నారు.

సత్య గణపతికి బంగారు వర్ణ రథం

శ్రీ సత్య గణపతి సేవా కమిటీ ఆధ్వర్యంలో సత్య (కర్ర) గణపతి శోభయాత్ర కోసం బంగారు వర్ణంలో నూతన రథం తయారు చేయించారు. ఇందుకోసం సుమారు రూ.5లక్షలు వెచ్చించారు. ఈరథంలో ఈ నెల 6న కర్ర గణపతి శోభయాత్రను నిర్వహించనున్నారు.

ఆర్మూర్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో యజ్ఞం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ డివిజన్ ఇంజినీర్ కార్యాలయంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ డీఈ రాజేశ్వర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేసి యజ్ఞం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.ఆర్మూర్ డివిజన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుడికి 108 రకాల నైవేద్యాలు

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి) గ్రామంలో రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వినాయకుడికి 108 రకాల నైవేద్యాలను సమర్పించారు. ఈసందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రుద్రూర్: రుద్రూర్‌లోని ఇందూర్ గణేశ్ మండలి వినాయకుడిని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు దర్శించుకున్నారు. శ్రీ కృష్ణ యాదవ సంఘం వినాయకుడి వద్ద కుంకుమార్చన నిర్వహించారు. రుద్రూర్ అంగడి బజార్ గణనాథున్ని తమలపాకులతో, సార్వ జనిక్ గణేశున్ని 19వేల బిల్వపత్రాలతో అలంకరించారు. వినాయకుడి వద్ద హోమం, మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు.



వన్నెల్(బి)లో వినాయకుడికి సమర్పించిన 108 రకాల నైవేద్యాలు



రుద్రూర్‌లో బిల్వపత్రాల అలంకరణలో ..



రథాన్ని ముస్తాబు చేస్తున్న కమిటీ సభ్యులు

జేపీఏ ఇన్సురెన్స్ చెక్కు అందజేత

బోధన్: ఎడపల్లి మండలం జానకంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సభ్యుడు పిట్ల గంగాధర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు, బుధవారం ఆయన కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల జేపీఏ(జనతా పర్సనల్ యాక్సిడెంట్) ఇన్సురెన్స్ చెక్కును సొసైటీ చైర్మన్ మిద్దె నరేందర్ అందజేశారు. వైస్ చైర్మన్ దాసరి ఒడ్డెన్న, డైరెక్టర్ గద్ద పెద్ద సాయన్న, ఒర్సు సాయిలు, సీఈవో గంగారెడ్డి, సిబ్బంది ప్రవీణ్ ,నర్సయ్య తదితరులున్నారు.

చెక్కులు, రేషన్‌కార్డుల పంపిణీ

నవీపేట : నూతన రేషన్‌కార్డులతో పాటు అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ బుధవారం అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 1552 మందికి రేషన్‌కార్డులు మంజూరయ్యాయన్నారు. 29 మందికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంజూరయ్యాయన్నారు.తహసీల్దార్ వెంకటరమణ, డీటీ రంజిత్‌కుమార్, నాయకులు రాజేందర్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, కిషన్‌రావ్, సంజీవ్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, బుచ్చన్న, బాబు తదితరులున్నారు.

అలీసాగర్ గేటు ఎత్తి దిగువకు నీటి విడుదల

బోధన్: ఎడపల్లి మండలం ఠాణాకలాన్ గ్రామ శివారులో గల అలీసాగర్ రిజర్వాయర్‌లో వరద నీరు చేరిక కొనసాగుతుంది. ఈ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1299.6 ఫీట్లు కాగా బుధవారం సాయంత్రం వరకు 1298.11 ఫీట్లవరకు నీరు చేరింది. దీంతో రిజర్వాయర్ ఒక గేటు ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని దిగువ నిజాంసాగర్ ప్రాజెక్టు డి–50 కాలువలో వదిలారు. రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 800 క్యూసెక్కులు ఉందని అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి నిజాంసాగర్ మెయిన్ కెనాల్‌ద్వారా వరద నీరు చేరుతోంది.

బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

బోధన్: కాంగ్రెస్ పార్టీ బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బీ. మల్లేష్ అన్నారు. బుధవారం ఎడపల్లి మండలం మంగల్‌పాడ్‌లో బీడీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.